నమస్తే తెలంగాణ నిజామాబాద్, మంగళవారం 14 మే 2024
TUESDAY, MAY 14, 2024



ధర్పల్లిలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు



ధర్మారంలో ఈవీఎం మొరాయించడంతో వేచిచూస్తున్న ఓటర్లు



కంట్రోల్ రూంలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



జిల్లాకేంద్రంలోని బాలుర ఐటీఐలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



రెంజల్ మండలం సాటాపూర్‌లో ఎన్నికల సరళిని తెలుసుకుంటున్న జడ్పీచైర్మన్ విఠల్‌రావు



మోర్తాడ్ మండలం తిమ్మాపూర్‌లో ఓటు వేసేందుకు బారులు తీరిన ప్రజలు




భీమ్‌గల్‌లో ఏర్పాటు చేసిన మాడల్ పోలింగ్ బూత్



ముప్కాల్ మండల కేంద్రంలో బారులుతీరిన ఓటర్లు



పొతంగల్ మండలం కల్లూర్‌లో బారులు తీరిన ఓటర్లు

# ఓటెత్తారు..

## జిల్లాలో పోలింగ్ ప్రశాంతం

- అక్కడక్కడా చెదురుమదురు ఘటనలు
- ఓటు హక్కును వినియోగించుకున్న ప్రముఖులు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, మే 13 : లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ చెదురు మదురు ఘటనలు మినహా సోమవారం జిల్లావ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం అయ్యే సరికే ఓటర్లు క్యూలైన్‌లో ఉన్నారు. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎంలను సిబ్బంది తమకు కేటాయించిన వాహనాల్లో పోలీసు భద్రత మధ్య డిచ్‌పల్లిలోని సీఎంసీలోని స్ట్రాంగ్ రూములకు తరలించారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తులు చేపట్టారు. ఎండ తీవ్రత నేపథ్యంలో ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా టెంట్లు వేయడంతోపాటు తాగునీటి సౌకర్యం కల్పించారు. వృద్ధులు, దివ్యాంగులను పోలింగ్ కేంద్రాలకు తీసుకువచ్చేందుకు సహాయకులను ఏర్పాటు చేశారు. ఓటు వేసేందుకు ప్రజలు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఉదయం 7 నుంచి 11 గంటల వరకు వేగంగా పోలింగ్ జరిగింది. మధ్యాహ్నం ఒంటి గంటల తర్వాత ఓటింగ్ ప్రక్రియ మందకొడిగా సాగినా.. సాయంత్రం మళ్లీ జోరందుకున్నది. చందూర్ మండలకేంద్రంలో 75.80 శాతం, మోస్రా మండల కేంద్రంలో 77.5 శాతం పోలింగ్ నమోదైనట్లు మండల ఎన్నికల అధికారులు రఫీ, తారాచంద్ తెలిపారు. రుద్రూర్ మండలంలో 80.91 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. కమ్మర్‌పల్లి మండలంలో 38 పోలింగ్‌కేంద్రాల్లో, మోర్తాడ్ మండలంలో 29 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ కొనసాగింది. ముప్కాల్ మండలంలో మొత్తం ఓటర్లు సంఖ్య 15,768 ఇందులో పురుషులు ఓటర్లు సంఖ్య 7,270 మహిళలు 8,498 మంది ఉన్నారు. ముప్కాల్ మండలంలో సుమారు 77 శాతం పోలింగ్ నమోదైంది. మండలంలో ఓటరు స్లిప్పులు అందక కొందరు ఓటర్లు ఇబ్బంది పడ్డారు.

రెంజల్ మండలంలో 34 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించారు. సమస్యాత్మకమైన నీలా, రెంజల్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను అడిషనల్ డీసీపీ కోటేశ్వర్‌రావు పర్యవేక్షించారు. సాటాపూర్‌లో జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, దూపల్లిలో మాజీ ఎమ్మెల్యే సతీమణి అయేషా ఫాతిమా ఎన్నికల సరళిని తెలుసుకున్నారు. నందిపేట్, డొంకేశ్వర్ మండల కేంద్రంలో రెండు మోడల్ పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. తోరణాలు కట్టి, గ్రీన్ కార్పెట్ వేసి ఓటుకు ఉన్న ప్రాధాన్యతను వివరిస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అవసరమున్న చోట టెంట్లు, టేబుళ్లు ఏర్పాటు చేశారు. నవీపేట మండలంలో 68.84 శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ నారాయణ తెలిపారు. ఏసీపీ శ్రీనవాస్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్, ఎస్సై యాదగిరిగౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆర్మూర్ నియోజకవర్గంలో సాయంత్రం 5గంటల వరకు 69శాతం పోలింగ్ నమోదైనట్లు రిటర్నింగ్ అధికారి ఆర్డీవో తెలిపారు.

### పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన మాజీ మంత్రి వేముల

భీమ్‌గల్ మండల కేంద్రంలోని హైస్కూల్‌లో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. బాల్కొండ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పోలింగ్ సరళిని పరిశీలించారు. మోర్తాడ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ మంచి మెజారిటీతో గెలుస్తారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్మూర్ పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాల (బాయ్స్ హై స్కూల్)లో పోలింగ్ కేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డితో కలిసి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ సందర్శించారు. జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు తన స్వగ్రామం మాక్లూర్ మండలంలోని వెంకటాపూర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. నవీపేట మండలంలోని తన సొంత గ్రామం సిరన్‌పల్లిలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు. నందిపేట్, మాక్లూర్ తదితర మండలాల్లో పోలింగ్ కేంద్రాలను ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి పరిశీలించారు.

### ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్..

కంఠేశ్వర్, మే 13 : జిల్లాకేంద్రంలోని బాలుర ఐటీఐలో జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు.

### పోలింగ్ సరళిని తెలుసుకున్న పోచారం..

కోటగిరి, మే 13 : కోటగిరిలోని హైస్కూల్, చావిడి గల్లీ, ఎస్సీ కాలనీ, మిర్జాపూర్‌క్యాంప్‌లో పోలింగ్ కేంద్రాలను మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. చందూర్, మోస్రా మండలకేంద్రాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులతో మాట్లాడి పోలింగ్ గురించి తెలుసుకున్నారు.

### బోధన్‌లో సజావుగా..

బోధన్, మే 13: బోధన్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో చెదురు మదురు సంఘటనలు తప్ప 246 పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ సజావుగా సాగింది. సాయంత్రం 5 గంటల వరకు 70.84 శాతం పోలింగ్ నమోదైంది. బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ పద్మావతి తన భర్త శరత్‌రెడ్డితో కలిసి బోధన్‌లో ఓటుహక్కును వినియోగించుకున్నారు.

### సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించిన ఏసీపీ శ్రీనివాస్

శక్కర్‌నగర్, మే13:బోధన్ పట్టణంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బలగాలు గట్టి బందోబస్తు చేపట్టాయి. పట్టణంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలతో పాటు, పలు పోలింగ్ కేంద్రాలను ఏసీపీ శ్రీనివాస్ సిబ్బందితో పర్యవేక్షించారు. ఏసీపీ నేతృత్వంలో పట్టణ, రూరల్ సీఐలు ఎస్.వీరయ్య, కోల నరేశ్‌తోపాటు పలువురు సీఐలు, ఎస్సైలు, సిబ్బంది, రిజర్వు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

### కట్టుదిట్టమైన భద్రత..

వినాయక్‌నగర్, మే 13 : జిలావ్యాప్తంగా ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా, ప్రశాంత వాతావరణంలో వినియోగించుకోవడానికి అవసరమైన అన్ని చర్యలను చేపట్టినట్లు సీపీ కల్మేశ్వర్ సింగెనవార్ తెలిపారు. అల్లరు జరగకుండా ప్రతి పోలింగ్ సెంటర్ సివిల్ పోలీస్ సిబ్బందితో పాటు కేంద్ర సాయుధ బలగాలు, మొబైల్ పెట్రోలింగ్, స్పెషల్ పోలీస్ ఫోర్స్, మఫ్టీ సిబ్బంది, ట్రైనీ పోలీసు సిబ్బంది విధుల్లో పాల్గొన్నారని వివరించారు. ఫొటో, వీడియో చిత్రీకరణతో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశారు. జిల్లాకేంద్రంలోని పలు ప్రాంతాల్లో భద్రతను సీపీ పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంతో పోలీసు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



ఎత్తొండలో మోడల్ పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు



దూపల్లిలో పోలింగ్‌కేంద్రం వద్ద వృద్ధురాలితో ఆత్మీయంగా మాట్లాడుతున్న ఆయేషా ఫాతిమా



ఏర్గట్లలో చిన్న పిల్లలను ఎత్తుకొని క్యూలో నిలబడిన మహిళలు



జిల్లాకేంద్రంలో ఓటు వేసేందుకు వీల్‌చైర్‌పై వస్తున్న దివ్యాంగ యువతి



ఎత్తొండలో ట్రైసైకిల్‌పై ఓటు వేసేందుకు వస్తున్న దివ్యాంగుడు



రుద్రూర్‌లో వృద్ధురాలిని వీల్‌చైర్‌పై తీసుకువస్తున్న సిబ్బంది



చందూర్ మండలం లక్ష్మాపూర్‌లో పక్షవాతంతో బాధపడుతూ ఓటు వేసేందుకు వచ్చిన వృద్ధుడు



జిల్లాకేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్న మేయర్ నీతూకిరణ్ కుటుంబం



ఓటు హక్కు వినియోగించుకున్న జిల్లా జడ్జి సునీత కుంచాల



ఓటు హక్కు వినియోగించుకున్న సీపీ కల్మేశ్వర్



అమెరికా నుంచి వచ్చి జిల్లాకేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్న యువతి



చందూర్‌లో ఓటింగ్ సరళిపై నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం



ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ కుటుంబీకులు



కోటగిరిలో ఓటు హక్కు వినియోగించుకున్న పోచారం సురేందర్‌రెడ్డి, నాయకులు



చందూర్‌లో ఓటు వేసేందుకు ఖమ్మం నుంచి వచ్చిన ఓ కుటుంబం



దోంచందలో మొదటిసారి ఓటు వేసిన యువతి









ఓటు హక్కు వినియోగించుకున్న ఇందల్వాయి జడ్పీటీసీ సుమనారవిరెడ్డి, ధర్పల్లి ఎంపీపీ సారికా హన్మంత్‌రెడ్డి, రుద్రూర్ జడ్పీటీసీ నారోజి గంగారాం, ఐడీసీఎంఎస్ మాజీ చైర్మన్ సాంబారి మోహన్ కుటుంబం



బోధన్ పట్టణం బసవతారకనగర్‌లోని ప్రాథమిక పాఠశాల పోలింగ్‌కేంద్రం వద్ద..

## ఉద్యోగం పేరిట మోసం

- లింగంపేటకు చెందిన యువకుడి ఆత్మహత్య

ఎల్లారెడ్డి రూరల్, మే 13: ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని డబ్బులు తీసుకొని మోసం చేయడంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన లింగంపేట్ మండలకేంద్రంలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపేట్‌కు చెందిన కుమ్మరి ప్రవీణ్ కుమార్ (28)కు తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన ఆరిఫ్‌తో పరిచయడం ఏర్పడింది. ఈ క్రమంలో తనకు ఉద్యోగం కావాలని ఆరిఫ్‌ను కోరగా, డబ్బులిస్తే ఇప్పిస్తానన్నాడు. 2019లో ఉద్యోగం కోసం ఆరిఫ్‌కు రూ. 2లక్షలు ఇవ్వడంతో నిజామాబాద్‌కు చెందిన రామకృష్ణారెడ్డి అలియాస్ ఆర్కేరెడ్డిని పరిచయం చేశాడు. రామకృష్ణారెడ్డికి సైతం ప్రవీణ్ విడుతల వారీగా రూ. 6 లక్షలు చెల్లించాడు. డబ్బులిచ్చి ఏండ్లు గడుస్తుండడంతో ఉద్యోగం కోసం ఆరిఫ్, రామకృష్ణారెడ్డిపై ఒత్తిడి చేశాడు. దీంతో వారు సంగారెడ్డిలో ఉద్యోగం వచ్చిందని చెప్పి ప్రవీణ్‌కు నియామకపత్రాన్ని అందించారు. వాటిని అక్కడి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి చూపించగా, అవి నకిలీవని అధికారులు వెల్లడించారు. దీంతో ఇంటికి తిరిగివచ్చిన ప్రవీణ్‌కుమార్.. తనకు ఉద్యోగం అక్కరలేదని, తన డబ్బులు తిరిగి ఇచ్చేయాలని ఆరిఫ్‌ను అడిగినా స్పందించలేదు. ఈ క్రమంలో డబ్బులు వృథా చేశావంటూ కుటుంబ సభ్యులు ప్రవీణ్‌ను తీవ్రంగా మందలించారు. దీంతో మనస్తాపం చెంది సోమవారం లింగంపేట్ శివారులోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఉద్యోగం పేరిటి మోసం చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## రూ. 5.42 లక్షల పట్టివేత

శక్కర్‌నగర్, మే 13: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఆదివారం రాత్రి పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఎలాంటి ఆధారాలూ లేకుండా లేకుండా ఓ వ్యక్తి తరలిస్తున్న నగదును సీజ్ చేశామని బోధన్ పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. విష్ణువర్ధన్‌రెడ్డి అనే వ్యక్తి వద్ద రూ. 5.42లక్షలు లభ్యం అయ్యాయని, ఈ డబ్బులకు చెందిన వివరాలు లేనందున, ఇట్టి డబ్బులను సీజ్ చేయడంతో పాటు, సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వీరయ్య తెలిపారు.

## మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

ఆర్మూర్‌టౌన్, మే13: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా పట్టణంలో స్వచ్ఛంద సేవా ప్రతినిధి లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ నివేదన్ సభ్యులతో కలిసి సోమవారం ఎన్నికల సిబ్బందికి మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో జెంటిల్ కిడ్స్ ప్రకాశ్, చేపూర్ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

## వీల్ చైర్ లేక ఇబ్బంది పడ్డ దివ్యాంగులు

వినాయక్‌నగర్, మే 13 : జిల్లాకేంద్రంలోని మహాలక్ష్మీనగర్‌లో ఉన్న వాసవి స్కూల్ (పోలింగ్ కేంద్రం 64)లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన దివ్యాంగులు వీల్‌చైర్ లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వినాయక్‌నగర్‌కు చెందిన దుబ్బాగౌడ్ కాలికి శస్త్రచికిత్స జరిగింది. ఆయన తన ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఉదయం 8 గంటలకు వాసవీ స్కూల్ వరకు తన కారులో వచ్చాడు. పోలింగ్‌స్టేషన్‌లోకి వెళ్లేందుకు వీల్‌చైర్ కావాలని విధుల్లో ఉన్న సిబ్బందిని అడిగినా.. వీల్‌చైల్ లేకపోవడంతో కుటుంబసభ్యుల సహకారంతో వాకర్ పట్టుకొని ఇబ్బందులు పడుతూ వెళ్లి ఓటు వేశారు. దివ్యాంగులకు వీల్‌చైర్‌ను అందుబాటులో ఉంచకపోవడం దారుణమని 'నమస్తే తెలంగాణ'తో ఆయన వాపోయారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
RECRUITMENT
★Pen, Pencil Company, Educated, Unemployed Girls/Boys, Male/Female, House Wife Earn 24500-64500 Packing Work at Home 9034548725, 9728230253
NT-3277
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.